ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం

మాజీ మంత్రి అప్పలరాజుపై కేసు

పలాస : మాజీ మంత్రి, వైసిపి నాయకులు డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు 16 మందిపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చిన్న నీలావతి గ్రామానికి చెందిన ప్రజాసంఘాల నాయకుడు తామాడ ఢిల్లీరావు మూడు నెలల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. తన భర్తను ఎవరో హత్య చేశారని ఆయన భార్య కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు నెలలైనా కేసును ఛేదించకపోవడంపై ఢిల్లీరావు భార్య కమల, ప్రజాసంఘాల నాయకులతో కలిసి గత నెల 28వ తేదీన కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి మహేశ్వర రెడ్డికి వినతిపత్రం అందించేందుకు మాజీ మంత్రి అప్పలరాజు వెళ్లారు. అప్పటికి ఎస్‌పి రాకపోవడంతో స్టేషన్ ముందు బైఠాయించారు. అప్పలరాజు తన అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు గుంపుగా వచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారని కేసు నమోదు చేశారు.

ముగింపా... కొనసాగింపా..?

ఇళ్లు లేని పేదలందరికీ గృహాలు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. లబ్ధిదారుల గుర్తింపుపై గతేడాది అక్టోబరులో గృహనిర్మాణ శాఖ సర్వే చేపట్టింది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఇళ్లు లేని వారు 49,738 మంది ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వం తొలుత జారీ చేసిన ఆదేశాల ప్రకారం సర్వే సోమవారంతో ముగియాల్సి ఉంది. సర్వే సందర్భంగా తప్పిపోయిన వారు, గ్రామాల్లో ఇంకా ఎవరైనా ఇళ్లు కావాల్సిన ఉండొచ్చన్న అంచనాతో సర్వేను మరో నెల రోజులు పొడిగించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతుంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

- **పేదలకు గృహాలపై గతేడాది పిఎంఎవై సర్వే**
- **ఇప్పటివరకు 49,738 మంది గుర్తింపు**
- **మార్చి 31తో ముగిసిన గడువు**
- **గడువు పొడిగిస్తారంటూ ప్రచారం**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఆర్థికంగా వెనుకబడిన, తక్కువ ఆదాయ తరగతి (ఎల్ఐజి), ఎక్కువ ఆదాయ తరగతి (ఎంఐజి) కేటగిరీల్లో ఉన్న అర్బన్ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికసాయం అందించాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులను వెచ్చించనున్నాయి. జిల్లావ్యాప్తంగా శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి రావడంతో ఈ పథకం అన్ని మండలాలకు వర్తించనుంది. పథకం కింద ఎంపికైన లబ్ధిదారునికి బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ (బిఎల్‌సి) కేటగిరీలో ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షల ఆర్థికసాయం అందించనుంది. అందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలను, భార్యాభర్తల ఆధార్ కార్డులను, సామాజిక తరగతి ధ్రువీకరణ పత్రాలను, రేషన్‌కార్డు పత్రాలతో పాటు దరఖాస్తు చేసుకోవాలి. గతంలో తమ పేర్లతో ఎటువంటి గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాని వారికి మాత్రమే మంజూరు చేస్తారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని తమ పరిధిలోని గృహనిర్మాణ శాఖ ఎఇకి అందించాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ, సఫాయికర్మచారి, అంగన్‌వాడీ వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర గుర్తించిన తరగతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. దరఖాస్తుల వివరాల నమోదుకు యునిఫైడ్ వెబ్ పోర్టల్‌నూ ప్రారంభించింది. లబ్ధిదారులు నేరుగానూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

ఇళ్ల స్థలం లేని వారు 5,760 మందిగా గుర్తింపు

జిల్లాలో ఇళ్లు లేని పేదలుగా గుర్తించిన 49,738 మందిలో 5,760 మందికి కనీసం ఇంటి స్థలమూ లేనట్లు గుర్తించారు. నరసన్నపేటలో అత్యధికంగా 840 మంది స్థలం లేని పేదలుగా తేలారు. జలుమూరులో 636 మందికి స్థలం లేదు. ఎచ్చెర్లలో 401 మందికి, పాతపట్నంలో 344 మందికి, పొందూరులో 310 మందికి, పోలాకిలో 286 మందికి, సరుబుజ్జిలిలో 279 మందికి ఇళ్ల స్థలాలు లేనట్లు గుర్తించారు. కంచిలిలో 1994 మందికి సొంత స్థలం ఉండి, ఇళ్లు లేని వారు ఉన్నట్లు గుర్తించారు. కవిటిలో 2,103 మంది, సంతబొమ్మాళి మండలంలో 1190 మందికి సొంత స్థలం ఉన్నా ఇళ్లు లేనట్లుగా తేలింది.

49,738 మంది లబ్ధిదారుల గుర్తింపు

పిఎంఎవై అర్బన్ 2.0 పథకం కోసం గతేడాది అక్టోబరులో సర్వే చేపట్టారు. గ్రామాల్లో గృహనిర్మాణశాఖ అధికారులు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. గృహ నిర్మాణశాఖ, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వేలో ఇప్పటివరకు 49,738 మందిని ఇళ్లు లేని పేదలుగా గుర్తించారు. ఇందులో 48,181 గ్రామీణ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు, 1517 మంది పట్టణ పరిధిలోని పేదలు ఉన్నారు. రణస్థలం మండలంలో అత్యధికంగా 2,914 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు సర్వేలో గుర్తించారు. జలుమూరు మండలంలో 2,085 మందికి, పోలాకిలో 2,069 మంది ఇళ్లు లేని పేదలు ఉన్నట్లు గుర్తించారు. గార మండలంలో 1738 మంది, కవిటిలో 2,103 మంది, కంచిలిలో 1944 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు గుర్తించారు. ఎచ్చెర్లలో 2338 మందికి, సారవకోటలో 1770 మందికి, నరసన్నపేటలో 2146 మందికి ఇళ్లు అవసరమైనట్లుగా సర్వేలో గుర్తించారు. హిరమండలంలో అత్యల్పంగా 812 మంది మాత్రమే ఇళ్లు కోరుకున్నట్లుగా తెలుస్తోంది. ఎల్ఎన్‌పేటలో 860 మందికి, మెళియాపుట్టిలో 857 మందికి, ఇచ్ఛాపురంలో 892 మందికి ఇళ్లు లేనట్లుగా సర్వేలో తేలింది.

అర్బన్ ప్రాంతాల్లో 818 మంది గుర్తింపు

జిల్లాలో నాలుగు అర్బన్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 1557 మందికి గృహాలు లేనట్లు సర్వేలో గుర్తించారు. శ్రీకాకుళం అర్బన్‌లో 462 మంది తమకు ఇళ్లు కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమదాలవలస అర్బన్‌లో 473 మందికి ఇళ్లు లేనట్లు తేలింది. ఇచ్ఛాపురంలో 180 మందికి, పలాస-కాశీబుగ్గలో 442 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించారు.

సర్వే చేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది (ఫైల్)

నమాజ్ చేస్తున్న ముస్లిములు

ఈద్ ముబారక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల్లో మత గురువులు ఖురాన్ పఠనం, సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్తూ పరస్పరం ఆత్మీయతతో కూడిన ఆలింగనం చేసుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని చారిత్రక జామియా మసీదులో వందల సంఖ్యలో ముస్లిములు నమాజ్ చేశారు. నెల రోజుల పాటు ముస్లిములు చేపట్టిన ఉపవాస దీక్ష ముగిసింది. ప్రార్థనలతో మసీదులన్నీ కళకళలాడాయి. ఉదయాన్నే మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు రంజాన్ విశేషాలను వివరించారు. అందరూ కలసి సహపంక్తిలో ఫలహారాన్ని స్వీకరించారు. నగరంలోని జామియా మసీదులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ముస్లిములే కాక ముస్లిమేతర సోదరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లాలోని ఇతర మసీదుల్లోనూ రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖతీబ్ ఇమాం ముస్తీ, జియాల్ రిజ్వి, ఇమాం అబ్దుల్ వమాబ్ సాహెబ్, షేక్ మహమ్మద్, ఎం.డి రఫీ, షేక్ సలీం, ఎం.ఎ బేగ్ పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో జామియా మసీదులో సోమవారం నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, వార్డు సభ్యులు గొలివి రామారావు, బతకల సంతోషి, పుచ్చల కల్పన పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ జామియా మజీద్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు షేక్ బాషా, ప్రెసిడెంట్ బాష,సెక్రటరీ భషీర్, హీమామ్, ముక్తార్ అలామ్, రాజేష్, జిలాని గౌస్, సాహిద్, తమీమ్, సాహిద్, మౌల, పప్పు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురం, మెళియాపుట్టిలో ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే గోవిందరావు ఆదేశాల మేరకు 30 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను అందించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ సయ్యద్, షేక్ సాంద్, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక కస్పావీధి మసీదులో ముస్లిములు ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగను చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్ద జోహార్‌ఖాన్, హెచ్.ఎం.అబ్దుల్లా, అమీర్ అలీ, జుల్లు ఆలీ బకరి, యూసఫ్ ఖాన్, అలీమ్ ఖాన్, ఎం.డి ఉస్మాన్, బషీర్, భాషి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

డిఇఒను తప్పించాలి

మంత్రికి ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలను అవలంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్న సమయంలో డిఇఒ అక్కడకు చేరుకొని అలజడి సృష్టించారని చెప్పారు. మాస్ కాపీయింగ్ పేరుతో 14 మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్ విధించారని తెలిపారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్, వారిపై పెట్టిన క్రిమినల్ కేసులు తక్షణం ఎత్తివేయాలని కోరారు. విద్యార్థులను భయాందోళనలకు గురిచేసి నిబంధనలకు విరుద్ధంగా ఐదుగురిని డిబార్ చేశారని చెప్పారు.

డిబార్ అయిన విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో నిజానిజాలు తెలుసుకునేందుకు డిఇఒను విధుల నుంచి తప్పించి, కలెక్టర్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి విద్యాశాఖ కమిషనర్ సీతారామరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు ఎత్తివేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చౌదరి రవీంద్ర, మదన్‌మోహన్, మురళీమోహన్, రాజారావు, శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో కుమ్మక్కై అనర్హత వేటు

వైసిపి అధినేత జగన్‌కు స్వర్ణమణి లేఖ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

స్వర్ణమణి

టిడిపి నాయకుల అవినీతిపై పోరాడుతున్న తనపై ఇచ్ఛాపురం మున్సిపాల్టీ వైసిపి చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఆమె భర్త దేవరాజు, నాయకులు సంతోష్ టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కుమ్మక్కై వైస్ చైర్‌పర్సన్‌గా తనపై అనర్హత వేటు వేశారని లాభాల స్వర్ణమణి వైసిపి అధినే జగన్మోహన్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నుంచి టిడిపి ఎమ్మెల్యే అశోక్, పట్టణ టిడిపి నాయకులతో వైసిపికి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఆమె భర్త దేవరాజు, సంతోష్ తిరుగుతున్నారని... అందుకు సంబంధించిన ఫొటోలతో సహా స్వర్ణమణి ఫిర్యాదు చేశారు. మున్సిపాల్టీలో టిడిపి నాయకుల అక్రమ కట్టడాలపై స.హ చట్టంతో ఫిర్యాదులు చేస్తూ పోరాడుతున్నానని తెలిపారు. అలాంటి తనను వైస్ చైర్‌పర్సన్‌గా అనర్హత వేసేందుకు మార్చిలో మున్సిపల్ సాధారణ సమావేశం అజెండాలో అంశం ప్రవేశపెట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అజెండా నిర్ణయించాల్సిన అధికారం మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మికి ఉండడంతో, ఆమె ఆ అంశం అజెండాలో పెట్టకుండా నిరోధించవచ్చని చెప్పారు. అలా చేయకుండా టిడిపి వాళ్లతో చేతులు కలిపి తనను పదవికి అనర్హురాలిని చేసి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. అధిష్టానం జోక్యం చేసుకుని ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో పరిమాణాలు, ఏకపక్ష నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిని ప్రశ్నించేందుకు పెద్ద నాయకులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా సమష్టిగా ఉండాల్సిన నాయకత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, కేడర్‌కు మింగుడు పడడం లేదని లేఖలో పేర్కొన్నారు. సొంత పార్టీకి చెందిన వైస్ చైర్‌పర్సన్‌ను అనర్హత వేటు వేయడంపై పార్టీ పెద్దలు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థుల శాతం పెంపునకు కృషి

విద్యార్థులతో మాట్లాడుతున్న అనురాధ

ఇచ్ఛాపురం : ప్రభుత్వ బాలుర వసతిగృహాల్లో విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని బిసి వెల్ఫేర్ అధికారి అనురాధ వార్డెన్ రవికుమార్‌కు సూచించారు. హాస్టల్‌ను సోమవారం ఆమె తనిఖీ చేసి, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా?, వార్డెన్ రాత్రిపూట హాస్టల్ ఉంటున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. 120 సీట్లకు గానూ 35 మంది ఉన్నారని, ఇంకా 65 సీట్లు భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఒడిశా గ్రామాల విద్యార్థులనూ హాస్టల్‌లో చేర్పించేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

మత్స్యకార గ్రామాల అభివృద్ధి

శ్రీకాకుళం రూరల్ : మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కుందువానిపేటలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఎల్ఇడి లైట్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఇళ్ల నిర్మాణం కూడా చేపడతామని చెప్పారు.

పాఠశాల విద్య బలోపేతం

- **విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు**
- **వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పాఠశాల విద్యను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన సంస్కరణలు తీసుకొస్తున్న విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలు స్థాయిని మార్పు చేయడమే తప్ప ఏ పాఠశాల రద్దు చేయడానికి వీల్లేదని, యధావిధిగా కొనసాగించాలని సూచించారు. ప్రతి మోడల్ పాఠశాలల్లో తరగతికి ఒకరు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాణాలు ఉన్న యుపి స్కూల్స్‌ను అవసరమున్న చోట హైస్కూల్‌గా మార్చేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. సమావేశంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, నాలుగు మండలాల ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

జీడి.. పూత దశలోనే వాడి

- **ఇప్పటికీ ప్రారంభం కాని పంట**
- **ఆందోళనలో జీడి రైతులు**

ప్రజాశక్తి - కవిటి

ఉగాది వచ్చిందంటే షడ్రుచుల సమ్మేళనంతో పాటు జీడి రైతుకు అదో ఆనందాల పంట. ఏటా ఉగాదికి తమ తోటలోని జీడిపిక్కలు, పళ్లు ఏరి వాటిని నైవేద్యంగా పెట్టడం జీడి రైతుల సంప్రదాయం. ఈ ఏడాది వారి సంప్రదాయానికి బ్రేక్ పడింది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో జీడి చెట్లు పూత దశలోనే ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో వచ్చిన పూతతో పాటు ఆకులు కూడా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 46743.63 ఎకరాల్లో జీడిపంట సాగవుతోంది. అందులో ఒక్క పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోనే సుమారు 24,753 ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తున్నారు. ఇక జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల టన్నుల జీడి పిక్కల దిగుబడి రావడమే కాకుండా, సుమారు 13 వేల మంది వరకు ఈ పంట ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు, కొన్ని తెగుళ్ల వల్ల జీడి పంటకు భారీ నష్టం వాటిల్లింది. రెండు నియోజకవర్గాల్లో సగానికి పైగా ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా చెట్లు పూత దశలోనే ఉంటే, మిగతా ప్రాంతాల్లో పూత ఎండిపోయి రైతును కోలుకోలేని దెబ్బ తీస్తోంది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న జీడి రైతులు నిరాశలో కూరుకుపోతున్నారు.

పూత దశలోనే దెబ్బతిన్న జీడి

సగం పంట రావడం కష్టమే

నాలుగు ఎకరాల్లో జీడిపంట సాగు చేస్తున్నాను. చాలావరకు పూత దశలోనే పంట దెబ్బతింది. మిగతా పంట పూర్తిగా వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో సగం పంట వచ్చే పరిస్థితి లేదు. రెండేళ్లుగా జీడి పంటపై పెట్టుకున్న ఆశలు అడియాశలుగా మారుతున్నాయి.

- ఎన్ని అశోక్, రైతు, చండిపుట్టుగ

పూత దశలోనే దెబ్బ

నాకు ఒకటిన్నర ఎకరాల జీడితోట ఉంది. పంట బాగా వస్తే మూడు నుంచి ఐదు బస్తాల పిక్కలు అవుతాయి. చాలావరకు పూత దశలోనే దెబ్బతింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక బస్తా పిక్కలైనా పరిస్థితి కనిపించడం లేదు.

- ఆర్.నారాయణరావు, రైతు, ముత్యాలపేట

పెట్టుబడి పెట్టాం.. ఫలితం లేదు

జూలై నుంచి ఇప్పటివరకు ఎకరా జీడి తోటకు ఒక్కో రైతు రూ.30వేలు వరకు ఖర్చు చేశారు. కొమ్మ కత్తిరింపులతో మొదలైన ఈ ప్రక్రియ ఇటీవల రెండు దశల్లో పురుగుమందులు పిచికారీ చేసే వరకు జరిగింది. ఇంత చేస్తే ప్రస్తుతం చాలావరకు పూతదశలోనే ఉంటే మరికొంత పూత ఎండిపోతోంది. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో జీడి పంట చాలా వరకు దెబ్బతింది. ఎకరాకు కనీసం రెండు బస్తాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- తెప్పల అజయ్ కుమార్, కన్వీనర్, జీడి రైతుల సంఘం

ప్రతికూల వాతావరణమే కారణం

ప్రతికూల వాతావరణ పరిస్థితులు జీడి పంటకు ప్రధాన ముప్పుగా మారాయి. మొన్నటి వరకు పొగ మంచు ఇబ్బంది పెడితే ప్రస్తుతం పగలు విపరీతమైన వేడి, రాత్రి చల్లని వాతావరణం జీడి పంటకు ప్రతికూలంగా మారింది. దీంతో చాలా ప్రాంతాల్లో చెట్లు పూతదశలోనే ఉండిపోతే మరికొన్ని ప్రాంతాల్లో వచ్చిన పూత ఎండిపోతోంది. ఈ ప్రాంతంలో రైతులు మొదట్నుంచీ పురుగుమందులు పిచికారీ చేయకపోవడంతో ఎక్కువగా టీ దోమ ప్రభావం కనిపిస్తోంది. జీడి పంటకు ఈ-క్రాప్ చేశాం. ఆ పరిస్థితులు వచ్చినప్పుడు ప్రభుత్వమే శాటిలైట్ విధానం ద్వారా నష్టం అంచనా వేసి పరిహారం అందిస్తుంది.

- పి.మాధవీలత, ఉద్యానశాఖ అధికారి

ఎన్నికైన ఫ్యాప్టో నూతన కార్యవర్గ సభ్యులు

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా చైర్మన్‌గా శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటాలు చేయడానికి ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా నూతన చైర్మన్‌గా బమ్మిడి శ్రీరామ్మూర్తి (యుటిఎఫ్) , సెక్రటరీ జనరల్‌గా పడాల ప్రతాప్ కుమార్ (బిటిఎ), కో చైర్మన్లుగా పూజారి హరిప్రసన్న (డిటిఎఫ్), వాల్తేటి సత్యనారాయణ (హెచ్‌ఎంఎ), డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా ఎస్.వి రమణమూర్తి (ఎస్‌టియు), మజ్జి మదన్‌మోహన్ (ఎపిటిఎఫ్ 257), బి.వెంకటేశ్వర్లు (ఎపిటిఎఫ్ 1938), కె.జగన్మోహనరావు (ఆప్టా) ఎన్నికయ్యారు.

వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎల్.బాబూరావు, ఎస్.రమేష్ కుమార్, పి.కృష్ణారావు, వై.వాసుదేవరావు, జి.రమణ, ఎస్.వి అనిల్ కుమార్, బి.రవి, ఎస్.ఎస్.ఎల్.వి పూర్ణిమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల రెండో తేదీన ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని తీర్మానించారు. ఎన్నికలకు రాష్ట్ర పరిశీలకునిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ వ్యవహరించారు. సమావేశంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, డిటిఎఫ్ కార్యదర్శి కె.అప్పలరాజు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఇన్‌ఛార్జీల పాలన?

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

స్వత్తు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోని మండలంలో కీలకమైన పదవుల్లో ఉండాల్సిన అధికారులు లేకపోవడంతో ఇన్‌ఛార్జీలతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమపథకాలకు రెవెన్యూశాఖ చాలా కీలకమైంది. పల్లెల్లో ఏం చేయాలన్నా... ఈ శాఖ అధికారులు ఉండాల్సిందే. అలాంటిది ఇది సంతబొమ్మాళి మండలానికి తహశీల్దార్ లేక పాలన కుంటుపడుతోంది. మండలంలో తహశీల్దార్ లేకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులకు సక్రమంగా అందడం లేదని విమర్శలు ఉండే ఉన్నాయి. తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఉద్యోగ విరమణ చేసి వెళ్లిపోయిన తర్వాత ఈ మండలానికి అదనపు బాధ్యతలు తీసుకున్న కోటబొమ్మాళి డిటి అప్పలరాజు రెండు మండలాలకు సమయం కేటాయిస్తున్నారు. డిప్యూటీ తహశీల్దార్ వి.ప్రవీణ్ కుమార్ బదిలీపై వెళ్లిన తర్వాత ఇప్పటివరకు ఆ కుర్చీలో ఆర్ఎస్ డిటిగా విధులు నిర్వహిస్తున్న హరిబాబును ఇన్‌ఛార్జిగా డిప్యూటీ తహశీల్దార్‌గా నియమించారు. అలాగే మండల స్థాయిలో ఎఎస్‌ఒ పోస్టు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంది. ఉపాధి హామీలో ఎపిఒ పోస్టులో ఆరు నెలలుగా టిఎ పి.నరసింహమూర్తి ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

తహశీల్దార్ కార్యాలయం

మండలంలో ప్రధాన కుర్చీల్లో అధికారులు కూర్చుని సుమారు మూడు నెలల అవుతుంది. అయినా ఇప్పటి వరకు రెగ్యులర్ అధికారులను నియమించలేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే రోజురోజుకూ పెరిగి పోతున్నాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అలాగే 34 పంచాయతీల్లో 25 మంది కార్యదర్శులు ఉండగా, అందులో జగన్నాథపురం, దండుగోపాల పురం కార్యదర్శులు సెలవులో ఉన్నారు. ఉమిలాడ కార్యదర్శి చైల్డ్ కేర్ లీవ్‌లో ఉన్నారు. మేఘవరం కార్యదర్శి ఉన్నత చదువుల కోసం సెలవు పెట్టారు. దీంతో 21 మంది కార్యదర్శులు 34 పంచాయతీల్లో 13 మంది ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే 20 సచివాలయాల్లో 17 మంది విఆర్‌ఒలు మాత్రమే పనిచేస్తున్నారు. ఆర్.హెచ్.పురం, హనుమంతునాయుడుపేట, డి.జి.పురం సచివాలయాలకు రెగ్యులర్ విఆర్‌ఒలు లేరు. మండలంలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది సైతం కొరతతో అల్లాడుతుంది. కొన్ని పిహెచ్‌సిల్లో స్టాఫ్‌నర్సులు సైతం సరిపడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఇన్‌ఛార్జీలతోనే పాలన కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇన్‌ఛార్జీలు తాత్కాలికమే కాబట్టి పూర్తిస్థాయిలో పనులపై దృష్టి సారించడం లేదు. దీంతో మండలం వాసులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంతబొమ్మాళి మండలంలో పనిచేయడానికి జిల్లాలోని తహశీల్దార్లు సుముఖత వ్యక్తం చేయడం లేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ప్రధానంగా ఈ మండలానికి తహశీల్దార్ రాకపోవడానికి పోర్టు పనులు ఒత్తిడి వల్ల రావడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ తీసుకొని పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

'ప్రజాశక్తి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

లోకేష్‌ను కలిసిన డిజిటల్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - కవిటి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం విశాఖపట్నంలో కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తూ... తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు ప్రభుత్వ దృష్టిలో ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా జివిడబ్ల్యుఎస్, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యాన పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి, ఎంపీ భరత్‌కూ వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సచివాలయ జెఎసి సభ్యులు పొల్యాలు అశోక్, పి జగదీష్, గణేష్, జాయి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మౌలిక వసతుల కల్పనకు వినతి

ప్రజాశక్తి - పోలాకి

పోలాకి పంచాయతీ పరిధిలోని విశ్వేశ్వర నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నామని అన్నారు. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతుందన్నారు. కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ బాగులేక నానా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సామాజిక భవనం, చిల్డ్రన్ పార్క్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యాబాజి రాము, లక్కోజీ గౌరీశంకర్, గోపి, బాలరాజు, రాజు, మోహన్, శంకర్ పాల్గొన్నారు.

సత్యసూర్య పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - టెక్కలి

విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బమ్మిడి ఆనందరావు సత్య సూర్య శతకం పుస్తకాన్ని రచించారు. దీనిని సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన ఈ పుస్తకంపై మూల తాతయ్య సమీక్షించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ ఉపాధ్యాయులు గుజ్జు వెంకటరెడ్డి సోమవారం ఆవిష్కరిస్తూ... మొదటి కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా పుస్తకరచయిత ఆనందరావును సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ ఎం.జగన్నాథరావు, కార్యదర్శి బొడ్డ ఆయ్యబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కూర్మాన ధనుంజయరావు, రేజేటి వెంకటరమణమూర్తి, కుప్పిలి కామేశ్వరరావు, గురువెల్లి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి సహాయ నిధి ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని, ఈ నిధి పేదలకు వరంలాంటిదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవన్‌లో నియోజకవర్గంలోని 14 మందికి లబ్ధిదారులకు రూ.14,73,550 సిఎం సహాయ నిధి చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సిఎం సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. నిరుద్యోగులు తమ విద్యార్హత, ఆధార్, ఫొటో జిరాక్స్‌లు పట్టుకొని హాజరు కావాలన్నారు.

గిరిజన ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అకిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సభ్యులు బిడ్డిక తేజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సంఘం జాతీయ అధ్యక్షులు పి.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షులు కరోతు సత్యనారాయణ పాల్గొన్నారు. జిల్లా నూతన అధ్యక్షునిగా ఎస్.ఎ.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీను, గౌరవాధ్యక్షునిగా బైరిసింగి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షునిగా సి హెచ్.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎస్.ఆనందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.రామారావు, ఉపాధ్యక్షునిగా గౌరీకరయ్య, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

3న విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలోని 33/11 కెవి సబ్-స్టేషన్ మెట్టక్కివలస టౌన్ -2 ఫీడర్ పరిధిలో ఈ నెల 3న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగిస్తున్నామని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెట్టక్కివలస, అమ్మానగర్, కుప్పిలివారివీధి, ఊసవానిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రంజాన్ తోఫా కిట్లు అందజేత

శ్రీకాకుళం అర్బన్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నగరంలో నివసిస్తున్న ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే గొండు శంకర్ తోఫా కిట్లను సోమవారం అందజేశారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, ఎమ్మెల్యే శంకర్ తమ సొంత నిధులతో వీటిని అందజేశారు. గోధుమపిండి ఐదు, పంచదార రెండు కేజీలు, సేమ్యా కిలో, ఖర్జూరం 1/2 కిలో, నెయ్యి వంద గ్రాములతో కూడిన కిట్లు అందించారు. టిడిపి నగర అధ్యక్షులు మాదరపు వెంకటేష్, టిడిపి నగర మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, ఎం.డి.రఫీ, షేక్ సలీం, షేక్ హుస్సేన్, ఎండి జాంగిర్, షేక్ రిహాన్ పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లావేరు : మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస సమీపంలోని సోమవారం రాత్రి హైవే పెట్రోలింగ్ వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డాడు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనాన్ని మండలంలోని వెంకటాపురానికి చెందిన పిన్నింటి రాము తన కారులో రణస్థలం నుంచి శ్రీకాకుళం వస్తున్నాడు. రావివలస సమీపంలో రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో పార్కు చేసిన హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పిన్నింటి రాము, డ్రైవర్ కాళ్లు విరిగిపోయాయి. వెంటనే 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మణరావు తన సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధ్రువపత్రం అందజేస్తున్న విప్ అశోక్

మెప్మా సిబ్బందికి అభినందనలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని మెప్మా సిబ్బందికి వరుసగా నాలుగు వరల్డ్ రికార్డులు సాధించారు. దీంతో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం అభినందించారు. వరల్డ్ రికార్డులు సాధించన సందర్భంగా మెప్మా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు విప్‌ను కలిశారు. అనంతరం గిన్నిస్ బుక్ రికార్డ్ ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఒ సంతోష్, ఆర్‌పిలు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఎమ్మెల్యే శిరీష పరామర్శ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఇటీవల టిడిపి నాయకులు జానకిరావు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష మండలంలోని కొత్తపేటలోని జానకిరావు ఇంటికి వెళ్లి సోమవారం వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట టిడిపి నాయకులు మల్ల సూర్యం, పుచ్చ ఈశ్వరరావు, గోవింద పాపారావు, బైపల్లి నారాయణ, కంబాల రాంబాబు, చింతా నారాయణ, దుర్రు నారాయణస్వామి ఉన్నారు.

బహుమతులు అందజేస్తున్న నాయకులు

పరుగుపందెం విజేత కాళీ

కవిటి: మండలంలోని బొరివంక గ్రామ యువత ఆధ్వర్యాన నిర్వహించిన 3కెఎం పరుగుపందెంలో బూరగాంకు చెందిన బద్రి కాళీ విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బి.శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ యువతలో అపారమైన శక్తి దాగుందని దానికి సానపడితే అద్భుతాలు జరుగుతాయని అన్నారు. ఈదుపురానికి చెందిన కార్తీక్, బూరగాంకు చెందిన వల్లభరావు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఈ పోటీలో విజేతలకు ఎఎస్ఐ కుర్మారావు, స్థానిక నాయకులు బహుమతులు అందించారు. ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యుడు బెందాళం విజయ్ కృష్ణ, బల్లెడ జయప్రకాష్, కాళీసాహు, శ్రీపతి, బల్లెడ లక్ష్మణమూర్తి మాస్టారు, బి.జయరాం మాస్టారు, సత్యానంద రౌళో, బి.తిరుపతి, జగ్గారావు పాల్గొన్నారు.



సవరమ్మను సన్మానిస్తున్న కుమార్ నాయక్

'జనజాగృతి'కి ప్రశంసలు

పలాస: జనజాగృతి సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు కుమార్ నాయక్ అధ్యక్షతన ఉగాది కవిసమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను జనజాగృతి వేదిక కాపాడుతోందని ప్రశంసించారు. వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సాహిత్యం శాశ్వతమైనదని, ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంటు ప్రొఫెసర్ విజయసింహ అన్నారు. కవి సమ్మేళనంలో 42 మంది కవులు తమ స్వీయ కవితలను వినిపించారు. కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.వై.దొర, అసిస్టెంటు బిసి వెల్ఫేర్ అధికారి అప్పారావు, జనజాగృతి కార్యదర్శి కాళిదాసు, బాలరాజు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

లావేరు : మండలంలోని కేశవరాయుపురంలో వడ్డి బోడమ్మకు చెందిన గడ్డి వామి దగ్ధమైంది. సమాచారం అందుకున్న రణస్థలం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తన శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేలు విలువ చేసే గడ్డి వామి దగ్ధమైందని బాధితురాలు వాపోయింది. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

న్యాయ పోరాటానికి సిద్ధం

2003 డిఎస్‌సి ఫోరం కన్వీనర్ శ్రీహరి

మాట్లాడుతున్న శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా 2003లో ఉద్యోగం చేరిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఓపిఎస్‌ను వర్తింపజేయాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని ఫోరం కన్వీనర్ కె.శ్రీహరి హెచ్చరించారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో 2003 డిఎస్‌సి ఫోరం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2003 డిఎస్‌సి కేవలం ప్రభుత్వ వైఖరి వల్లే నియామకాలు ఆలస్యమైందన్నారు. 2005 నవంబరులో నియామకాలు చేపట్టడంతో పాత పెన్షన్ విధానంలోకి రాలేకపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇటువంటి వారి కోసం పాత పెన్షన్‌ను వర్తింపజేస్తూ మెమో 57 జారీ చేసిందన్నారు. ఆ మెమోను యథాతథంగా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడంతో 11 వేల మందికి పైగా నష్ట ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌ను కోల్పోతున్నారని అన్నారు. అందువల్ల మెమో 57 ద్వారా అర్హత ఉన్న వారికి పాత పెన్షన్‌ను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఫోరం నాయకులు రూప రాజు మాట్లాడుతూ సమిష్టి న్యాయ పోరాటం ద్వారానే ఓపిఎస్‌ను సాధించుకోగలమన్నారు. సమావేశంలో జిల్లా కో-కన్వీనర్లు కె.ప్రకాష్, పి.శ్రీకర్, బి.శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపడాలి

కొత్తూరు: రోగులకు మరింత వైద్య సేవలు అందించాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. మండలంలోని కురిగాం పిహెచ్‌సి వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ అధ్యక్షతన 20వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాలయాల్లో, కళాశాలల్లో వార్షికోత్సవాలు శామని అన్నారు. కానీ, వైద్యశాలలో వార్షికోత్సవం నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. మారుమూల గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటు ఆధునికీకరణగా ఉందన్నారు. అనంతరం పలువురుని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జంపు కృష్ణమోహన్, నరేష్ కుమార్, పొగిరి ప్రకాష్, దినేష్, శ్రీలక్ష్మి, తిరుపతిరావు, సందీప్‌కుమార్, వేణుగోపాలరావు, తేజేశ్వరి, శరత్‌కుమార్, రమేష్, విశ్రాంత ఎంపిడిఒ సలాన చిరంజీవరావు, సర్పంచ్ సేపేన అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ పైల లక్ష్మణరావు, సూపర్‌వైజర్ బుచ్చిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

నిరసన తెలుపుతున్న ట్రాన్స్‌జెండర్లు

ట్రాన్స్‌జెండర్ల నిరసన

ఇచ్ఛాపురం : ఇటీవల అనకాపల్లిలో దారుణ హత్యకు గురైన దీపు అనే హిజ్రా ఘటనకు నిరసనగా బస్టాండ్ కూడలి వద్ద నియోజవర్గానికి చెందిన హిజ్రాలు సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిందితుడి బన్నీని కఠినంగా శిక్షించాలని, హిజ్రాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సంజన కిన్నెర, లల్లీ నిహారిక, మీనాక్షి సోనియా, బెబో, సోనాలి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

పొందూరు: మండలంలోని ఆలయాల్లో, మసీదులు, చర్చిల వద్ద తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పొందూరు పోలీస్ స్టేషన్‌లో కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేలా ముందస్తుగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పాతపట్నం: మండలంలోని ఆలయాల్లో, చర్చిల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ బి.లావణ్య సూచించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో పూజారులు, ఫాస్టర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే వారిని పట్టుకునేందుకు అనుగుణంగా ఉండేందుకు వీలు ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పలాస

ఆర్‌టిసి కండక్టర్ నీలకంఠం సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి డిపో వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో తప్పు చేశారని పలాస డిపో అధికారులు ఒకసారి సస్పెండ్ చేసి మళ్లీ విధుల్లోకి తీసుకున్నారని అన్నారు. ఇది జరిగి నెల రోజుల తర్వాత జిల్లా అధికారులు మళ్లీ సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కండక్టర్‌ని తక్షణమే విధుల్లోకి తీసుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.భానుమూర్తి జోనల్ సెక్రెటరీ పి.కె.మూర్తి, రీజనల్ ప్రెసిడెంట్ టి.త్రినాథ్, పలాస డిపో కార్యదర్శి ఎ.డి.కుమార్, జి.కె.రాజు, ఎం.ఎస్.నారాయణ, ఐ.జి.రావు పాల్గొన్నారు.

ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన...

ఆర్‌టిసి కండక్టర్ సవర నీలకంఠం అక్రమ సస్పెన్షన్ తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు డిపో ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మేనేజర్ సీతారాంనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, జెఎసి జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు, ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, సవర రామారావు, సవర వరహాల కృష్ణారావు, సవర సిద్ధు, వరహాలమ్మ పాల్గొన్నారు.

డిబార్ విద్యార్థులకు న్యాయం చేయాలి

ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఆదర్శ పాఠశాలలో ఇటీవల డిబార్ అయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ కోరారు. నగరంలోని క్రాంతి భవనంలో ఎస్‌టియు కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే పరీక్షలకు ముందే ఆ కేంద్రాన్ని మార్చుకునే వీలుందన్నారు. కానీ, అందుకు భిన్నంగా అక్కడ కేంద్రాన్ని ఇచ్చి చూసి రాతల పేరుతో ఉపాధ్యాయులను, విద్యార్థులను బలిచేయడం వెనుక డిఇఒ తిరుమల చైతన్య అంతర్యం ఏమిటో అర్థమవుతుందని అన్నారు. కేవలం ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాన్ని ఎంచుకుని విచిత్ర పరిస్థితిని తీసుకొచ్చారని అభిప్రాయపడ్డారు. డిఇఒ ఎంచుకున్న తనిఖీ విధానాన్ని తప్పుపట్టారు. తక్షణమే డిబారైన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్లు ఎత్తివేయాలని, క్రిమినల్ కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి జి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, కె.శ్రీనివాసరావు, ఎన్.లక్ష్మణరావు, పి.రమణ, డి.వి.ఎన్.పట్నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తాగునీటి సరఫరాకు నిధుల మంజూరు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘంలోని అన్ని వార్డులకు తాగునీటి సరఫరా మెరుగుపరుచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధిశాఖ ఆమదాలవలస పురపాలక సంఘంలో అర్బన్ వాటర్ సప్లయి, సెప్పేజ్ మేనేజ్‌మెంట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు అర్బన్ లోకల్ బాడీస్‌లో ఏషియన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు స్కీం కింద ఇంప్లిమెంట్ చేందుకు రూ.68.80 కోట్లు రిలైజ్ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిధులతో పురపాలక సంఘంలో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేయుటకు పట్టణ ప్రాంతంలో నీటి సరఫరా మెరుగుపరుచేందుకు అన్ని శివారు వార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా ఇంటింటికీ తాగునీటి సరఫరా చేయనున్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి కళింగ కోమటి సంఘానికి చెందిన టంకాల వెంకటరమణ సౌజన్యంతో పట్టణంలోని సుమారు 30 మంది పేదలకు దుప్పట్లు, చీరలు సోమవారం పంపిణీ చేశారు. టిడిపి ఆవిర్భావం సందర్భంగా అభిమానిగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు రమణ తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కోరాడ రాంప్రసాద్, ఖండ్యాన పేర్రాజు, ఇప్పిలి రవి, బర్ల మురళి, సోడిమూడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్రాలను అందజేస్తున్న టిడిపి నాయకులు

ఆమదాలవలస : పేదల సంక్షేమమే లక్ష్యంగా టిడిపి పనిచేస్తుందని టిడిపి రాష్ట్ర న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు.

పింఛన్ల పత్రాలు అందజేత

పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో మంజూరైన పది వితంతు, ఒక డయాలసిస్ పింఛన్ల మంజూరు పత్రాలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యాలయ అధికార ప్రతినిధి మొదలవలస రమేష్, వార్డు ఇన్‌ఛార్జి ఎన్ని శ్రీదేవి, పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్ యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కవిటి

ఓవైపు అనారోగ్యం, మరోవైపు తీవ్రమైన ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న కవిటి మండలం సహలాలపుట్టుగకు చెందిన డయాలసిస్ బాధితుడు పొట్టి దుర్యోధనకు బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ అండగా నిలిచింది. దుర్యోధన దయనీయ పరిస్థితిని పేదింట.. పెద్ద కష్టం అంటూ 'ప్రజాశక్తి' ఇటీవల ప్రచురించింది. వారానికి మూడు డయాలసిస్‌లు చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఆర్థిక సమస్యలతో ఒక డయాలసిస్ కు రూ.3వేలు చెల్లించి పలాసలో ఇబ్బందులు పడుతున్నారని కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన వైద్య అధికారులు, సిబ్బంది అతనికి కవిటి డయాలసిస్ సెంటర్ లో బెడ్ కేటాయించారు. కొంతమంది దాతల సాయంతో పాటు బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, రూ.7 వేలు అందించింది. వచ్చే నెల నుంచి అతనికి డయాలసిస్ పింఛను కూడా మంజూరు కానున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో కాళీ సాహు, మున్నా, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : కలిసి చదువుకున్న స్నేహితుడు ఇచ్ఛాపురం సాయికృష్ణ కష్టాల్లో ఉన్నాడు. విషయం తెలుసుకొని తన వంతుగా సహాయం చేయాలని ఉద్దేశంతో పలాస మండలం తెలుగు యువత అధ్యక్షుడు, జైభీం యువజన సంఘం అధ్యక్షుడు కిక్కిర ఢిల్లీరావు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

అన్నమయ్య కీర్తన ఆలపిస్తున్న చంద్రశేఖర్

'గరిమెళ్ల'కు స్వర నీరాజనం

ప్రజాశక్తి- కవిటి

పరమ వాగ్గేయకారుడు, టిటిడి ఆస్థాన విద్వాంసుడు స్వర్గీయ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు గొండ్యాలపుట్టుగలో స్వర నీరాజనం అర్పించారు. స్థానిక కళాకారుల ఆధ్వర్యాన కచేరి ఏర్పాటు చేసి గరిమెళ్ల అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గరిమెళ్ల గాత్రం ప్రతి ఇంట్లో ప్రభవిస్తుందని, ఆధ్యాత్మిక ప్రపంచంలో గరిమెళ్ల గాత్రానిది ప్రత్యేక స్థానమని అన్నారు. కార్యక్రమంలో ఉద్దానం ప్రాంతం కళాకారులతో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మందులను పంపిణీ చేస్తున్న జగదీశ్వరరావు

మందుల పంపిణీ

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస పంచాయతీ చిన్ననారాయణపురం గొర్రెలు పెంపకందారుడు దాసరి అచ్చియ్యకు మందులను ఎపి యాదవ సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెలు మేకలకు జబ్బులు రాకుండా ముందస్తు మందులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో లింగాలవలస వెటర్నరీ డాక్టర్ పూర్ణచంద్రరావు, వెటర్నరీ అసిస్టెంట్ నూతన్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గాంధీ

గాంధీ పరామర్శ

బూర్జ : మండలంలోని చీడివలసకు చెందిన బూర్లి దుర్గారావు కుమారుడు మణికంఠ ఇటీవల సంభవించిన విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాయకులు సువ్వారి గాంధీ మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గారావును అన్ని విధంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయనతో పాటు బూరి లక్ష్మునాయుడు, పోతురాజు సూర్యారావు, విజయ్, ముల్లు ధర్మ, కొల్లివలస శివ, వై.గోపాల్, మోహన్ చౌదరి, కె.ప్రశాంత్, రాజారావు, సిహెచ్.మోహన్, పి.ధనుంజయ్, సిహెచ్.జనార్ధన్, రాము పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావు...

పలాస : మండలంలోని గొల్లమాకన్నపల్లికి చెందిన జనసైనికుడు కొరాడా మధుసూదన్ రోడ్డు ప్రమాదం, అలాగే వైద్యులు టి.బాలకృష్ణ తండ్రి, న్యాయవాది రవిపట్నాయక్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు సోమవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న పూర్ణచంద్రరావు

ఎస్‌సి రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న దుర్గారావు

ప్రభుత్వం చేపట్టనున్న ఎస్‌సి విభజన వల్ల మాల, మాదిగ, రెల్లి, ఇతర ఉప కులాలకు సమ న్యాయం చేపట్టాలని, అందుకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు పోతల దుర్గారావు కోరారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన భవన్‌లో మాల ఉద్యోగుల ఉపాధ్యాయ పెన్షనర్ల జెఎసి ఆధ్వర్యాన సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని వర్గీకరణ చేయాలన్నారు. మాల, మాదిగ, రెల్లి ఉపకులాలు సమిష్టిగానే జీవనం సాగిస్తున్నాయని అన్నారు. రిజర్వేషన్ శాతాన్ని పెంచకుండా విభజన చేయడం వల్ల కొన్ని తరగతుల ప్రయోజనం దెబ్బతింటుందన్నారు. విభజించి పాలించు విధాన్ని పాలకులు అవలంబించడం సరికాదన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు దండాసి రాంబాబు, అంపోలు ప్రతాప్, రామప్పడు, గంజి ఎజ్రా, రాము, అప్పన్న, రమేష్‌బాబు, బోనెల రమేష్, రమణ, రవికుమార్, రామారావు, తవిటయ్య, పాపారావు, గౌరి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మజ్జిగను అందజేస్తున్న దేవేంద్రరెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నార్త్ కేబిన్ దగ్గర యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఎస్.కృష్ణమూర్తి మాస్టర్ జ్ఞాపకార్థంతో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా వేసవిలో మూడు నెలలు పాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చి, పేద మహిళకు ఉపాధి కల్పిస్తున్న ట్రస్టు చైర్మన్ ఎం.రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజ్‌మెంట్ సాహుకారి భాను తేజ, జె.సుందర్ నారాయణ, ఎంపిటిసి కాళ్ల గోపి, చిన్ని బైరి, పేరయ్య, పి.గిరి, కె.రామారావు, ప్రేమ్ దోలాయి, సంతోష్, కె.ధర్మరాజు, కె.శ్రీను పాల్గొన్నారు.

నటిస్తున్న కళాకారులు

అలరించిన నాటక సౌరభాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లలో ఉన్న కాటమేశ్వరి అమ్మవారి ఆలయం 43వ వార్షికోత్సవం, ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. రామాంజనేయ యుద్ధంలో రాముడుగా కందుల గున్నేశ్వరరావు, ఆంజనేయుడుగా పైడి నాయుడురావుల యుద్ధ సీన్, గయోపాఖ్యానం యుద్ధసీనులో కృష్ణుడుగా ఏలూరు పైడిరాజు, అర్జునుడుగా తలాడ నరసింహనాయుడులు నటనతో ఆకట్టుకున్నారు. అదేవిధంగా సత్యహరిశ్చంద్ర నాటకం వారణాసి, కాటి సీన్లో హరిశ్చంద్రుడుగా బి.ఎస్.చలం నటన, గాత్రంతో ప్రసంశలు అందుకున్నారు. 15 ఏళ్ల వయసులో నక్షత్రక పాత్రధారిగా కోమలిప్రియ, చంద్రమతిగా గాయత్రిలు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని రక్తి కట్టించారు. పౌరాణిక నాటకాలను ఆదరించాలని వైద్యులు దంతం భీమారావు కోరుతూ నటులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఏటా ఉగాది పర్వదినం రోజున కాటమేశ్వరి పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు రఘుపాత్రుని సుధాకర్, ఆనెం రామారావులు తెలిపారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పాల్గొన్న గ్రామస్తులు

మండలంలోని నువ్వలరేవులో సందడిగా శ్రీరామ నవమి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. 12 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం తక్కురాణి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి దాసుడు మువ్వల డొమ్మ, ఘంటోమోనరి మువ్వల పురుషోత్తంలు అలంకారణతో, సాంస్కృతిక కార్యక్రమాలతో జన సంద్రం నడుమ ఊరేగారు. కాగా, సుమారు 10 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఉత్సవ వేడుకల్లో మొదటి తంతు చేపట్టారు. దీంతో గ్రామ ప్రధాన వీధి జనంతో కిక్కిరిసింది. అలాగే యువతీ యువకులు నృత్యాలతో సందడి చేశారు.

పొందూరు: మండలంలోని రాపాకలోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు కూనపులి రమణమూర్తి, ఆలయ పూజారి గోపి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంతో మత సామరస్యం

మాట్లాడుతున్న రఫీ

రణస్థలం: హిందూ, ముస్లిములు భాయి భాయి అని ముస్లిం రచయిత సంఘం సంయుక్త రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రఫీ అన్నారు. శ్రీకాకుళంలోని కేంద్ర గ్రంథాలయంలో హిందూ, ముస్లిముల భాయ్ భాయ్ కవి సమ్మేళం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత సామరస్యాలకు ప్రతీక ఈ కవిసమ్మేళనం అని అన్నారు. మానవవత్వానికి మించిన మతం ఏముందని అన్నారు. ముఖ్య అతిధి సురంగి మోహనరావు మాట్లాడుతూ భారత దేశం భిన్నత్వంలో ఏకత్వమని అన్నారు. కార్యక్రమంలో కవులు గుడిమెట్ల గోపాలకృష్ణ, వాడాడ శ్రీనివాస్, పసుపురెడ్డి శ్రీను, గుణస్వామి, తంగి ఎర్రమ్మ బి.సంతోష్ కుమార్, విజయ లక్ష్మణ్ తదితరులు కవితలు ఆలోచింపజేశాయి. అనంతరం ఈవేమన తన సంస్థ కవితా మయం ద్వారా విశేష వైద్య సేవలు అందించిన పి. బి.దేవిడ్‌కి ఆరోగ్య మిత్ర బిరుదును మోహనరావు అందజేశారు.

పాటను చిత్రీకరిస్తున్న కరుణాకర్

సమ సమాజ పాట చిత్రీకరణ

ప్రజాశక్తి- పలాస

కలంగళం క్రియేషన్ ఆధ్వర్యాన పాత బస్టాండ్, రైల్వే స్టేషన్ మైదాన పరిసర ప్రాంతాల్లో సమసమాజ స్థాపనకు సోమవారం పాట చిత్రీకరణ చేశారు. కలంగనిరి కరుణాకర్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం, పాటుబడిన మహనీయుల జీవిత చరిత్ర, జయంతిలు గుర్తు చేస్తూ ప్రజల్లో చైతన్యానికి ప్రజలు ముందు ఉండాలని కోరారు. కార్యక్రమంలో పిట్ట జోగారావు, ఎంఎంఎస్ జిల్లా కమిటీ అధ్యక్షులు గీతారాణి, ఎపిఎన్‌జిఒ, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఉపాధ్యాయులు బోకర దుర్యోధన, చెల్లూరు పద్మలోచన, సూర్యం, తెప్ప పాపారావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై పోరాటం

టెక్కలి : విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానని పెన్షనర్ల, ఉద్యోగ సంఘ నాయకులు మోదుగువలస గణపతిరావు అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ని సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా పెన్షనర్లకు ఒకటో తేదీన వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఎ బకాయిలు మంజూరుకు ప్రభుత్వానికి వినతిపత్రం అందివ్వనున్నట్లు తెలిపారు. గణపతి ఎంపికపై పలువురు అభినందించారు.

సన్మానిస్తున్న సభ్యులు

రామ్మోహనరావుకు సన్మానం

పలాస : విజయనగరం యువజన విభాగం హాల్లో సోమవారం యుఎన్‌ఎ ఇంటర్నేషనల్ చేయూత సోషల్ సర్వీస్ ఆధ్వర్యాన పలాస ఆర్‌టిసి డిపోలో జి.రామ్మోహన రావు సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయన సేవలకు యుఎన్‌ఎ ఇంటర్నేషనల్ చేయూత సోషల్ సర్వీస్ నిర్వాహకులు సోమవారం దుశ్శాలువతో సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వై.ఎన్.చిన్నారావు, రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ మహిళా విభాగం అధ్యక్షులు సుభాష్ శర్మ, యు.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఆయనకు అవార్డు లభించడంతో డిపో మేనేజర్ సీతారామనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

4 నుంచి హటకేశ్వర స్వామి యాత్ర

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలం సింగుపురంలోని పార్వతీ కొండమ్మ సమేత హటకేశ్వర స్వామి కళ్యాణాది యాత్ర ఉత్సవాలు ఈ నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు పెంట రామకృష్ణ శర్మ, కార్యనిర్వహణ అధికారి పి.మాధవిలు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఏటా చైత్రమాసం సప్తమి రోజులు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు